ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
మంగళవారం 17 సెప్టెంబరు 2024


కాళేశ్వరం గోదావరిలో గణనాథుడి నిమజ్జనం

బై... బై... గణేశా


కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద వినాయక విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు


కాళేశ్వరం గోదావరి వద్ద గణపతితో సెల్ఫీ

- మార్మోగిన విఘ్నేశ్వర నామం
- వైభవంగా నిమజ్జనోత్సవం
- డీజేలతో దద్దరిల్లిన భూపాలపల్లి జిల్లా
- ఘనంగా శోభాయాత్రలు.. పలికిన ధర్మ ప్రచార కమిటీలు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 16: గణపతి నామస్మరణం మారుమోగిపోయింది. 'జై బోలో గణేష్ మహరాజ్‌కి జై..' 'గణ బొప్పా మోరియా...' అంటూ భక్తులు హోరెత్తించారు. విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా సోమవారం జరిగింది. ఊరూరా శోభాయాత్రలు జరగ్గా భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజే చప్పుళ్లు, నృత్యాలు, కోలాటాల నడుమ వినాయకుడిని సాగనంపారు. జిల్లాలో ముఖ్యంగా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి సన్నిధి గోదావరితోపాటు గణపురం మండలంలోని గణపసముద్రం చెరువులో గణేషుడిని నిమజ్జనం చేశారు. జిల్లా నలువైపులా పట్టణాలు, గ్రామాలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి విగ్రహాలు తరలి వచ్చాయి. భూపాలపల్లి పట్టణం నుంచే కాకుండా జిల్లాలోని గణపురం, రేగొండ, మల్హర్, మహాముత్తారం, మహదేవపూర్, కాటారం మండలాల భక్తులు కాళేశ్వరంలోని గోదావరి నదికి విగ్రహాలను తీసుకువెళ్లారు. గణపురం మండలంలోని పలు గ్రామాల భక్తులు సమీపంలోని గణపసముద్రం చెరువుకు తరలించారు. జిల్లాలోని ఇతర గ్రామాల్లోనూ చెరువులు, కుంటల్లో వినాయకుడిని నిమజ్జనం చేశారు.

జిల్లా వ్యాప్తంగా 1400 విగ్రహాలు

గణేష్ నవరాత్రుల నేపథ్యంలో జిల్లాలోని 12 మండలాల్లో 1400 వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. ఒక్క భూపాలపల్లి పట్టణంలోనే 180 మండపాలు ఏర్పాటయ్యాయి. గ్రామాలు, పట్టణాల్లో, వాడవాడలా గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చివరి రోజు నిమజ్జనోత్సవం జరగ్గా శోభాయాత్రలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రహదారులపై బీజేపీ అనుబంధ విశ్వహిందూ పరిషత్, ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేసి గణనాథుడికి స్వాగతం పలికారు. మండపాల నిర్వాహకులను ఆ వేదికపై సన్మానించారు. అలాగే అధికార పార్టీ నేతలు, వ్యాపార వాణిజ్య రంగాలకు చెందిన వారు ధర్మ వాహిని గణేష్ ఉత్సవ కమిటీని నియమించి ప్రత్యేక స్టేజీని ఏర్పాటు చేశారు. వినాయకులను నిమజ్జనానికి తీసుకొస్తున్న కమిటీల సభ్యులను స్టేజీ మీద సత్కరించారు.

నిమజ్జనానికి మూడు క్రేన్లు

ప్రతీసారి భక్తులే స్వయంగా గోదావరి నదిలో కానీ, చెరువులో కానీ గణపతి ప్రతిమను నిమజ్జనం చేసేవారు. ఈ క్రమంలో పలుచోట్లా ప్రమాదాలు జరిగేవి. అయితే.. ఈసారి అధికారులు ప్రధానమైన రెండు చోట్లా మూడు క్రేన్లను ఏర్పాటు చేశారు. ఇందులో కాళేశ్వరంలోని అంతర్రాష్ట్ర వంతెనపై నిమజ్జనానికి రెండు ఏర్పాటు చేయగా గణపురం మండలకేంద్రంలోని గణపసముద్రం చెరువు వద్ద ఒక క్రేన్‌ను ఏర్పాటు చేశారు.

270 మంది పోలీసులతో భద్రత

గణపతి నిమజ్జనోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ కిరణ్‌ఖరే నేతృత్వంలో 270 మంది పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇద్దరు డీఎస్పీలు, 8 మంది సీఐలు, 18 మంది ఎస్సైలు సహా 270 మంది ఇందులో పాల్గొన్నారు. ప్రధానంగా జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గోదావరి నది వద్ద, గణపురం మండలకేంద్రంలోని గణపసముద్రం చెరువు వద్ద పోలీసులు పెద్దమొత్తంలో మోహరించారు. అలాగే ప్రదాన కూడళ్లు, సభా వేదికల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్రల సందర్భంగా రోడ్లపై ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టారు. గణేష్ మండ పాలను ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ వాటిని త్వరగా కాళేశ్వరం వెళ్లేలా చర్యలు చేపట్టారు. అలాగే సింగరేణి రెస్క్యూ టీం సభ్యులు 20మంది కాళేశ్వరం, గణపురం రెండుచోట్ల విధుల్లో పాల్గొన్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా నీళ్లలో పడిపోయినా వెంటనే రక్షించేందుకు వీరు అప్రమత్తంగా ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గణపతి నిమజ్జనోత్సవం సందర్భంగా ధర్మ ప్రచార వేదికలపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. గణపతి మండపాల ఎదుట మహిళలు కోలాటాలు వేయగా, పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. డప్పుల చప్పుళ్లతో, డీజే పాటలతో నృత్యాలు చేస్తూ గణపతిని సాగనంపారు.


గణపసముద్రం వద్ద గణనాథుల నిమజ్జనం


భూపాలపల్లిలో శోభాయాత్రలో మహిళల కోలాటం


భూపాలపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఘనంగా గణనాథుడి నిమజ్జనం

- వైభవంగా ముగిసిన నవరాత్రోత్సవాలు
- చివరి రోజు ప్రత్యేక పూజలు, అన్నప్రసాద పంపిణీ
- శోభాయాత్రగా విగ్రహాల తరలింపు
- వెల్లివిరిసిన భక్తిభావం

ములుగు, సెప్టెంబరు 16: గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. వినాయకుడి తీరొక్క విగ్రహాలను కొలువుదీర్చిన భక్తులు తొమ్మిదిరోజులపాటు నిష్టగా పూజలు చేశారు. చివరి రోజున ఊరేగింపుగా తరలించి నిమజ్జనం చేశారు. అన్నప్రసాద పంపిణీ, సామూహిక పూజా వేడుకలతో గ్రామగ్రామాన భక్తిభావం వెల్లివిరిసింది. సోమవారం సాయంత్రం మొదలైన నిజమజ్జనోత్సవం అర్ధరాత్రి వరకు కొనసాగింది. జిల్లా అధికార యంత్రాంగం ఏడుచోట్ల ఏర్పాట్లు చేయగా ఆయా గ్రామాల పరిధిలోని చెరువులు, కుంటల వద్ద పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం పూజ అనంతరం మధ్యాహ్నం భక్తులు, పేదలకు అన్నప్రసాద పంపిణీ జరిగింది. ఆతర్వాత ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. విఘ్ననాధునికి సమర్పించిన లడ్డును దక్కించుకోవడాన్ని అదృష్టంగా భావించే భక్తులు పోటీ పడ్డారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం 6గంటల తర్వాత విగ్రహాల తరలింపు మొదలైంది. అందంగా అలంకరించిన ట్రాక్టర్‌లు, టెంపో వాహనాల ద్వారా పురవీధుల గుండా శోభాయాత్రలు జరిపారు. యువతీయువకులు హుషారుగా కోలాట నృత్యాలు చేశారు. డీజేలు, టపాసులకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో కోలాహలం లేక ఊరేగింపు కొంత కళతప్పింది. జిల్లాకేంద్రం సమీపంలోని తోపుకుంట, ఏటూరునాగారం ముల్లకట్ట, చల్వాయి గౌరారం చెరువు, మేడారం జంపన్నవాగు, తదితర చోట్ల పోలీసు, రెవెన్యూ అధికారులు క్రేయిన్‌లు, జేసీబీలను ఏర్పాటుచేశారు. గజ ఈతగాళ్లను నియమించారు. విగ్రహాలను క్రేయిన్‌ల ద్వారా సిబ్బంది నిమజ్జనం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా 200మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో ములుగు డీఎస్పీ రవీందర్, ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ, సీఐలు, ఎస్సైలు నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షించారు. ముల్లకట్ట వద్ద వాజేడు, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల విగ్రహాలను నిమజ్జనం చేయగా సందడి నెలకొంది. ఏటూరునాగారం సబ్‌డివిజన్ పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.


వాజేడు మండలం జగన్నాథపురంలో శోభాయాత్రలో భక్తులు


ములుగు తోపుకుంట వద్ద నిమజ్జనాన్ని పర్యవేక్షిస్తున్న పోలీసులు, అధికారులు


గోవిందరావుపేటలో కారుపై గణనాథుడు


ములుగు సమీపంలోని తోపుకుంట వద్ద నిమజ్జనం

సాయుధ సంగ్రామం.. విముక్తి గీతం

"బండెనక బండికట్టి.. పదహారుబండ్లు కట్టి
ఏ బండ్లె పోతవు కొడుకో.. నైజాం సర్కరోడా
చుట్టుముట్టూ సూర్యాపేట.. నట్టనడుమ నల్లగొండ
నువుండేది హైదరాబాద్.. దాని పక్క గోలుకొండ
గోలుకొండ ఖిలా కింద.. నీ ఘోరీ కడతం
కొడుకో.. నైనాము సర్కరోడా.."



- 'విమోచన' పోరాటంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా
- నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డిన యోధులెందరో
- నేడు తెలంగాణ విమోచన దినం

అంటూ తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలనపై తిరగబడ్డారు. రజాకార్లు, పోలీసులు అణిచివేసినా.. భూస్వాములు, జమిందారులు, తాబేదార్లు ఆ నిజాం రాచరికానికి బాసటగా నిలిచినా.. బానిస బంధనాల నుంచి విముక్తి కోసం.. భూమికోసం, భుక్తికోసం కొట్లాడారు. ఓ వైపు జాతీయజెండాలు.. మరోవైపు ఆయుధాలు చేత బట్టిన ఎందరో యోధులు అవిశ్రాంత పోరాటం చేశారు. వారిలో కొందరు ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. అనేక మంది ప్రాణత్యాగాలు చేశారు. నాడు ఉవ్వెత్తున సాగిన విమోచన సాయుధ సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పాత్ర కీలకం.

విమోచన ఉద్యమచరిత్రలో ఓరుగల్లు తనకంటూ ఒక పేజీని లిఖించుకుంది. ఈ పోరుబాటలో ఎందరో యోధుల గళం.. విముక్తి గీతంలా ప్రతిధ్వనించగా.. బైరాన్‌పల్లి, కూటిగల్, పరకాల తదితర గ్రామాల్లో రజాకార్లు చేసిన మారణకాండ విప్లవ స్ఫూర్తిని రగిల్చింది. చివరకు యోధులు, ప్రజల పోరాటానికి నిజాం సర్కారు తలవంచింది. 1948 సెప్టెంబరు 17న తెలంగాణకు విముక్తి లభించింది.

ప్రత్యేక కథనాలు 7వ పేజీలో...

నేడు ప్రజాపాలన దినోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి సీతక్క
- కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లు


ములుగు కలెక్టరేట్‌లో ఏర్పాటవుతున్న ప్రజాపాలన దినోత్సవ వేదిక

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 16: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం జిల్లావ్యాప్తంగా మంగళవారం జరగనుంది. కలెక్టరేట్ ఆవరణలో జరిగే కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్ భవనాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ వేడు కలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హాజరు కానున్నారు. ఉదయం 10 గంటలకు జాతీయ జెండాను మంత్రి ఎగురవేయనున్నారు. జాతీయ గీతాలాపన తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించిన అనంతరం ప్రత్యేక పురస్కారాలను ప్రదానం చేస్తారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర ఒక ప్రకటనలో కోరారు.

భూపాలపల్లి కలెక్టరేట్‌లో..

భూపాలపల్లి కలెక్టరేట్ : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని భూపాలపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య హాజరవుతారని కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను వీరయ్య ఎగురవేస్తారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు ఉదయం 9 గంటలకే కలెక్టరేట్‌కు చేరుకోవాలని సూచించారు.

వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 16: సీజనల్ వ్యాధుల పట్ల హాస్టల్ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ములుగు మండలంలోని బాలురు, బాలికల వసతిగృహాల్లో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించగా ఆయన పరిశీలించారు. డీఎంహెచ్‌వో పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, చికున్‌గున్యా, డెంగీ, విషజ్వరాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 83 వైద్యశిబిరాలు నిర్వహించడం జరిగిందని, 5253 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు తెలిపారు. జ్వరం ఉన్నవారికి ఆర్‌డీటీ, మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం నలుగురు జిల్లా ప్రోగ్రాం అధికారులను నియమించారు. మంగపేట మండలానికి డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, వెంకటాపురం, వాజేడు మండలాలకు డాక్టర్ క్రాంతికుమార్, తాడ్వాయికి డాక్టర్ శ్రీకాంత్, ములుగు, వెంకటాపూర్ మండలాలకు రణధీర్, గోవిందరావుపేటకు భవ్యశ్రీలను నియమించారు. వైద్యశిబిరాల్లో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో వినూత్నం

6వ పేజీలో..


ప్రారంభోత్సవానికి సిద్ధంగా కంటైనర్ పాఠశాల

- రాష్ట్రంలో మొట్టమొదటి కంటైనర్ పాఠశాల
- ములుగు జిల్లా కన్నాయిగూడెంలో ఏర్పాటు
- నేడు పంచాయతీరాజ్ మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభోత్సం

19న కేజీబీవీ ఉద్యోగార్థుల సర్టిఫికేట్ వెరిఫికేషన్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 16: కేజీబీవీలలో ఉద్యోగాల భర్తీ కోసం పరీక్ష రాసి ఉత్తీర్ణులైన వారికి ఈనెల 19వ తేదీన సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఉంటుందని డీఈవో ఎం.రాజేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్ర శిక్షణ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశానుసారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కేజీబీవీలలో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన రాతపరీక్షలో ఉత్తీర్ణులైన వారిని 1:3 ప్రాతిపదికన ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పాత డీఈవో కార్యాలయం ఆవరణలో ఉంటుందని పేర్కొన్నారు.



ఏజెన్సీలో వినూత్నం

ములుగు జిల్లా కన్నాయిగూడెంలో రాష్ట్రంలో మొట్టమొదటి కంటైనర్ పాఠశాల ఏర్పాటు


గతంలో పాఠశాలను నిర్వహించింది ఈ పాకలోనే..

ఏటూరునాగారం రూరల్/కన్నాయిగూడెం, సెప్టెంబరు 16: వినూత్న ప్రయోగానికి ఏజెన్సీ నిలయమైంది. ఏళ్ల తరబడి పూరి గుడిసెలో సాగిన చదువులకు గ్రహణం వీడింది. అటవీ పల్లెలో విద్యాబోధన కోసం ఓ కంటైనర్ సిద్ధమైంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం కంతనపల్లి గ్రామ పంచాయతీ పరిధి మారుమూల అటవీ ప్రాంతంలోని బంగారుపల్లి గ్రామంలో ఈ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో శాశ్వత నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడం వల్ల కలెక్టర్ ఈ మేరకు చర్యలు చేపట్టారు. ఈ కంటైనర్ పాఠశాలను మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించనున్నారు.

ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయానికి 18 కిలోమీటర్ల దూరంలోని కన్నాయిగూడెం మండలం మండలం కంతనపల్లి సమీప అటవీ ప్రాం తానికి ఛత్తీస్‌గఢ్ నుంచి 2000లో గొత్తికోయలు వలస వచ్చి ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి ప్రభు త్వం వీరి పిల్లల చదువుల కోసం 2010లో ఇక్కడ ఓపాకలో పాఠశాల ను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ దానికి శాశ్వత నిర్మాణం జరగలేదు. పక్కా భవనం నిర్మించేందుకు అటవీ శాఖ అనుమతు లను నిరాకరిస్తోంది. దీంతో గొత్తికోయ పిల్లలు ఏళ్లతరబడి అదే పాకలో అష్టాకష్టాలు పడుతూ చదువుకుంటున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఇక్కడ విద్యాబోధన సాగుతోంది. మొత్తం 35 మంది పిల్లలు ఈ పాఠశాలలో చదువుకుం టున్నారు.

రాష్ట్రంలో మొట్టమొదటి కంటైనర్ పాఠశాల

పాఠశాల శాశ్వత నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో ఇక్కడ కంటైనర్ (ప్రీఫ్యాబ్రికేటెడ్ హౌజ్)ను ఏర్పాటు చేయాలని ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర్ నిర్ణయించారు. ఇందుకు రూ. 13 లక్షలు వెచ్చించారు. ఈనెల 11న పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపాదికన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తున్నారు. ఇప్పుడా పాఠశాల ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. మొత్తం ఐదు తరగతులకు 35 మంది విద్యార్థుల కోసం 12 డ్యూయెల్ డెస్కులు ఇందులో ఏర్పాటు చేశారు. అటవీ శాఖ అనుమతుల నిరాకరణ నేపథ్యంలో రెండు ననెలల క్రితం తాడ్వాయి మండలంలో మొట్టమొదటి కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేయగా, ఇప్పుడు అదే తరహాలో కన్నాయిగూడెం మండలం కంతనపల్లిలో పాఠశాలను ప్రారంభించనున్నారు. మంత్రి సీతక్క చేతుల మీదుగా మంగళవారం ఈ పాఠశాల ప్రారంభం కానుంది. దీనిపై గొత్తికోయవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది: పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రాచారి

ఈ పాఠశాలకు 2022లో ప్రధానోపాధ్యాయుడిగా చేరాను. అప్పటి నుంచి పాఠశాల భవన నిర్మాణానికి కృషి చేశాను. కొని కారణాల వల్ల పాఠశాల భవనానికి పునాది పడలేదు. కానీ కలెక్టర్ చొరవతో ప్రీఫ్యాబ్రికెటెడ్ కంటైనర్ పాఠశాల సిద్ధం కావడం ఆనందంగా ఉంది. కంటైనర్ పాఠశాల నిర్మాణంతో విద్యార్థుల ఇక్కట్లు తీరనున్నాయి.


ప్రారంభోత్సవానికి సిద్ధంగా కంటైనర్ పాఠశాల లోపలి దృశ్యం

బై..బై.. గణేశా..

వరంగల్ నగరంలో ప్రశాంతంగా జరిగిన వినాయక నిమజ్జనం



కాజీపేట బంధం చెరువులో క్రేన్ సహాయంతో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సిబ్బంది


చిన్నవడ్డేపల్లి చెరువులో నిమజ్జనం అవుతున్న గణపతులు


చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద సైకిల్ రిక్షాపై వెళుతూ..


చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జనానికి కారుపై..


కాజీపేట బంధం చెరువు వద్ద బైక్‌పై వెళుతూ..


చిట్టి గణపతులను ఎత్తుకుని నిమజ్జనానికి తరలిస్తున్న యువతులు, చిన్నారి




వేయిస్తంభాల గుడి కోనేరులో నిమజ్జన దృశ్యం


వరంగల్ చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద సిద్ధంగా ఉన్న రెస్క్యూ సిబ్బంది


ఆంధ్రజ్యోతి మడికొండ యూనిట్ ఆఫీసులో సిబ్బంది నిమజ్జన సంబురం


వరంగల్ చిన్న వడ్డేపల్లి చెరువులో నిమజ్జనంలో కలెక్టర్ సత్య శారద

సాయుధ సంగ్రామం.. విముక్తి గీతం..

'విమోచన' పోరాటంలో అగ్రభాగాన ఉమ్మడి వరంగల్ జిల్లా


హనుమకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అగ్రభాగాన నిలిచింది. సాయుధ రజాకార్లు, నిజాం పోలీసుల అణిచివేసినా.. భూస్వామ్య జమిందారి వర్గం, తాబేదార్లు రాచరికానికి బాసటగా నిలిచినా.. ఎంతో మంది యోధులు ఎదురొడ్డారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. అవమానాల్ని భరించారు. అనేక మంది ప్రాణత్యాగాలు కూడా చేశారు. ఆయుధాలు చేత బట్టి.. జైళ్లలో మగ్గారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ ఉద్యమంలో వరంగల్ జిల్లా పోరాటాల గడ్డగా నిలిచి.. విమోచన ఉద్యమ చరిత్రలో తనకంటూ ఒక పేజీని లిఖించుకుంది. కాకతీయులు ఏలినగడ్డపై రజాకార్లను ఎదురించిన వ్యక్తిగా బత్తిని మొగిలయ్య గౌడ్ నిలిచారు. అంతేకాదు బైరాన్‌పల్లి, కూటిగల్, పరకాల ఇలా ఎన్నో గ్రామాల్లో రజాకార్ల విధ్వంసకాండ నేటికీ గుర్తుండిపోయింది. ఈ నేపథ్యంలో రజాకార్ల అండతో చెలరేగిన దొరల దౌర్జన్యాన్ని ఎదురించిన చాకలి అయిలమ్మ ధీరత్వం పలువురికి మార్గదర్శకం చేసింది. పోరాటయోధులు తొర్రూరులో పోలీసు క్యాంపుపై దాడిచేసి దాన్ని లేవనెత్తించారు. కడవెండి, అమ్మాపూర్, నాంచారిమడూరు తదితర ప్రాంతాల్లో సాగిన తెలంగాణ విమోచన ఉద్యమాలు ప్రజల స్వేచ్ఛా పిపాసకు నిలువెత్తు పతాకలు. నాడు నిజాంల అండతో రజాకార్లు విధ్వంసాలు, అకృత్యాలకు పాల్పడుతున్న వేళ ప్రజలు కొందరు పొరుగురాష్ట్రాలకు పారిపోయారు. మిగిలిన ప్రజల రక్షణ భారాన్ని ఉద్యమకారులు తీసుకున్నారు. నాడు పోరాట వ్యూహంలో భాగంగా ఉద్యమకారులు నైజాం స్టేట్‌లో కాక, ఇండియన్ యూనియన్ భూభాగాలైన చందా (మహారాష్ట్ర). గదక్ (కర్నాటక), విజయవాడ (ఆంధ్ర) మొదలైన ప్రాంతాల్లో సరిహద్దు శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సరిహద్దు శిబిరానికి ఒక్కొక్కరు నాయత్వం వహించారు. విజయవాడలోని శిబిరం హయగ్రీవాచారి నాయత్వంలో నడవగా ఉద్యమ ప్రచారానికి అవసరమైన పోస్టర్లు, కరపత్రాలను రాత్రివేళల్లో గ్రామాల్లో పంచేవారు. రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి మందుగుండు సామగ్రి వచ్చేది. ఈ విధ్వంస రచనను గమనించిన కేంద్ర ప్రభుత్వం రజాకార్ల అరాచకత్వం, విశృంఖలత్వం అంతమొందించాల్సిన అవసరం గుర్తించి 1948 సెప్టెంబరు 13న పోలీసు చర్యకు ఆదేశించింది. ఆ సమయంలో చేపట్టిన ఆపరేషన్ పోలో విజయవంతం కావడంలో వరంగల్ మామునూరు విమానాశ్రయం ఎంతగానో దోహదపడింది. విమానాల ద్వారా సైన్యం ఇక్కడికి చేరుకుని రజాకార్లను ఎక్కడికక్కడ అణిచివేసింది. ఇక దిక్కులేని స్థితిలో 1948 సెప్టెంబరు 17న నిజాం రాజు ఉస్మాన్ అలీ ఖాన్ తలవంచడంతో నిజాం నిరంకుశ పాలన నుంచి ప్రజలకు విముక్తి లభించింది.

పరకాల మారణ హోమం

విమోచన సంగ్రామంలో పరకాల మారణ హోమం ఒక రక్తసిక్త ఘట్టం. జన జాగృతిలో భాగంగా 1947 సెప్టెంబరు 2న తాలూకాకేంద్రం అయిన పరకాల సమీపంలోని పైడిపెల్లి తాటివనంలో ఉద్యమనాయకులు సమావేశం నిర్వహించగా ప్రజలు భారీగా తరలివచ్చారు. కానీ అప్పటికే ఒకవైపు పోలీసులు, మరోవైపు రజాకార్లు మోహరించారు. ఉద్యమాన్ని విరమించుకోవలని పోలీసులు సూచించినా ప్రజలు వినలేదు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ ఇచ్చిన ఆదేశాలతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. దీన్ని అదనుగా చేసుకున్న రజాకార్లు కూడా తల్వార్లు, కత్తులు, బరిసెలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అనేక మంది ప్రాణాలు విడిచారు. ఎంతోమంది కాళ్లు, చేతులు తెగిపడ్డాయి. మాంసం ముద్దలు, రక్తపుటేరులతో ఆ ప్రదేశమంతా భయంకరంగా.. మరో జలియన్‌వాలా బాగ్‌ను తలపింపజేసింది.

బైరాన్‌పల్లి బీభత్సం

నిజాం సైన్యం బలగాలను, రజాకార్ల రాక్షసకృత్యాలను బైరాన్‌పల్లి గ్రామస్థులంతా ఐక్యతతో ఎదురించారు. ఈ పోరాటానికి ఇమ్మడి రాజిరెడ్డి, జగ్గం హనుమంతు, చల్లా నర్సిరెడ్డి, మోటాపోశాలు, తోటరాములు ఇమ్మడి రాంరెడ్డి తదితర యోధులు నాయకత్వం వహించారు. ఓ రోజున రజాకార్లు దూలిమిట్ల, లింగాపురం గ్రామాలను దోచుకొని సొమ్మునంతా బండ్లపై తరలిస్తుండగా బైరాన్‌పల్లి రక్షక దళం రజాకార్లను ఎదురించి తరిమికొట్టింది. దీంతో బిత్తరపోయిన రజాకార్లు ప్రతీకారేచ్ఛతో రగిలిపోయారు. ఆ కక్షతో కూటిగల్ గ్రామంలో 20మందిని కాల్చి చంపారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 12రోజులకే 1947 ఆగస్టు 27న అర్ధరాత్రి రజాకార్ల మూకలు బైరాన్‌పల్లిని చుట్టుముట్టి.. బైరాన్‌పల్లి బురుజుపై ఉన్న గస్తీదళ సభ్యులపై కాల్పులు జరిపారు. బురుజుపై ఉన్న పోరాటవీరులు తమ వద్ద ఉన్న మందుగుండు అయిపోయేంత వరకు సైన్యాన్ని నిలువరించగలిగారు. బురుజు వైపు నుంచి కాల్పులు ఆగిపోగానే సైన్యం బలగాలు గ్రామంలోకి ప్రవేశించి మారణహోమాన్ని సృష్టించాయి. పారిపోగా మిగిలిన 84 మందిని వరుసగా నిలబెట్టిన నిర్ధాక్షిణ్యంగా కాల్చిచంపారు రజాకార్లు. ఆ తదనంతర కాలంలో రజాకార్ల అండతో దొర సాగిస్తున్న దాష్టీకాలను చాకలి అయిలమ్మ ఎంతో ధైర్యంతో ఎదురించింది. దాడులను లెక్క చేయక మొక్కవోని ధీరత్వంతో పోరాటం సాగించి తన భూమిని కాపాడుకున్నది. ఐలమ్మ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని అనేకచోట్ల పోరాటయోధులు రజాకార్లకు వ్యతిరేకంగా దాడులు సాగించారు. తొర్రూరులో పోలీసుక్యాంపుపై దాడిచేసి దానిని లేవనెత్తించారు. కడవెండి అమ్మాపూర్, నాంచారిమడూర్‌కు చెందిన అనేక మంది పోరులో పాల్గొన్నారు. జఫర్‌గడ్‌లో, మధిర తాలూకా సిరిపురం గ్రామంలో రజాకార్లు సమరశీలురైన రైతులను కాల్చి చంపారు. 200 మంది రజాకార్లు వచ్చి అల్లీపురం గ్రామాన్ని తగులబెట్టారు. వీటికి ప్రతిగా పోరాటయోధులు ఆయా ప్రాంతాల్లో రజాకార్లపై ప్రతిదాడి జరిపి ప్రతీకారం తీర్చుకున్నారు.


పరకాలలోని అమరధామం

మొగిలయ్య వీరమరణం

రజాకార్ల దాష్టీకానికి పరాకాష్టగా నిలుస్తుంది బత్తిని మొగిలయ్య హత్యోదంతం. 1946లో తెలంగాణ విమోచనోద్యమం ఒక పక్క, భారత స్వాతంత్రోద్యమం మరో పక్క ముమ్మరంగా సాగుతున్న రోజులవి. వరంగల్ కోట నివాసి అయిన మొగిలయ్య మొదటి నుంచి విమోచనోద్యమంలో చురుకుగా పాల్గొనేవాడు. ఉద్యమంలో భాగంగా సర్వోదయ సంఘం పక్షాన ప్రతీవారం వరంగల్ కోటలో జాతీయ జెండాను ఎగురవేసే కార్యక్రమాన్ని చేపట్టారు. 1946 ఆగస్టు 11న కోటలో జెండా ఎగురువేసిన తర్వాత కాశీంషరీఫ్ నాయత్వంలో రజాకార్లు హఠాత్తుగా దాడి చేశారు. రజాకార్లను ఎదరించే క్రమంలో మొగిలయ్య వారి కత్తిపోట్లకు గురై నేలకొరిగాడు.

'కాటారం' వీరులెందరో..

కాటారం, సెప్టెంబరు 16: తెలంగాణ విముక్తి పోరులో భూపాలపల్లి జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ (పూర్వ కరీంనగర్‌జిల్లా) వాసులెందరో వీరోచితంగా పోరాడారు. దామెరకుంట, మహదేవపూర్, మంథని ప్రాంతాలకు చెందిన యోధులు త్యాగాలు చేశారు. ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలోని మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు నాయకత్వం వహించగా, రఘునాథ్‌కాచే జిల్లాలో తొలి సత్యాగ్రహవాదిగా కీలక భూమిక పోషించారు. రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో మంథనికి చెందిన గులుకోట శ్రీరాములు నేతృత్వంలో దామెరకుంట, మహదేవ్‌పూర్, మంథనికి చెందిన వెంకటయ్య, చిన్న పోచిరెడ్డి, కొడిపెల్లి వెంకటయ్య, బక్క రాజయ్య, రాజిరెడ్డి, కిషన్‌రావు, ప్రభాకర్, చంటయ్య, రాజన్న, రాంపెల్లి కిష్టయ్య, దామోదర్, శివనాద్రి శంకరయ్య, నరహరి, సీతారాం తదితరులు సాయుధ పోరాటం చేశారు. స్వామి రామానందతీర్థ పిలుపుతో సత్యాగ్రహ ఉద్యమంలో రఘునాథ్ కాచే ఆధ్వర్యంలో గణపతి, రాజేశ్వర్‌రావు, రాజన్నచారి సహా పలువురు పాల్గొని నిజాంకు వ్యతిరేకంగా పోరాడి కరీంనగర్, నిజామాబాద్ జైళ్లలో శిక్షను అనుభవించారు. దామెరకుంటకు చెందిన ఐత చిన్నపోచిరెడ్డిని రజాకార్ల సైన్యం ధన్వాడ వద్ద చంపడం విషాదాన్ని నింపింది. శ్రీరాములు బృందం మహారాష్ట్రలోని చంద్రాపూర్(చాందా)లో సాయుధ శిక్షణ పొంది, గడ్చిరోలి జిల్లా సిరొంచ కేంద్రంగా క్యాంపును ఏర్పాటు చేసుకుంది. అజ్ఞాతంలో ఉంటూ మంథని, మహదేవపూర్ తాలూకాల్లో నిజాం పోలీసు అధికారులపై గెరిల్లా దాడులు చేశారు. 1948లో గోదావరినది దాటి నిజాం సర్కార్ దామెరకుంట, కాళేశ్వరం, మహదేవపూర్‌లో ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్లపై దాడి చేశారు. దామెరకుంటలో కలెక్టర్ పర్యటన సందర్భంగా తహసీల్ అధికారులపై దాడి చేసి చంపిన సంఘటన సంచలనం రేపింది. ఈ దాడుల స్ఫూర్తితో ఈ ప్రాంతాల్లో ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించారు.


సిల్వర్ జూబ్లీ స్వాతంత్ర్యానికి గుర్తుగా ఏర్పాటు చేసిన స్థూపం

రక్తమోడిన తమ్మడపల్లి(జి)

జఫర్‌గడ్, సెప్టెంబరు 16: తెలంగాణ సాయుధ పోరులో భాగంగా జఫర్‌గడ్‌ను కేంద్రంగా చేసుకుని నిజాం అనుచరుడైన రజాకార్ల నాయకుడు ఖాదరెల్లి చేస్తున్న దౌర్జన్యాలను అరికట్టేందుకు, రజాకార్లు, జాగీదారుల ఆగడాలను అడ్డుకునేందుకు ప్రజలు రక్షకదళాలను ఏర్పరచుకుని రాళ్లు, కర్రలు, వడిశాలలు, బర్సీలు, కత్తులు లాంటి సంప్రదాయ ఆయుధాలతో పోరుబాటలో నడిచారు. కమ్యూనిస్టు దళ నేతలు నల్ల నర్సింహులు, కృష్ణమూర్తి, యాదగిరిరావు, కూనూరు నెల్లుట్ల మోహన్‌రావు, పెండ్యాల రాఘవరావు, పంబాల రాఘవరావు, ఎలమంద, తదితరులు సంచరిస్తూ ఈ రక్షకదళాలు, ప్రజలు, రైతులను చైతన్యపరిచేవారు. సాయుధ పోరులో భాగం గా 1947, సెప్టెంబరు 11న జరిగిన ఆంధ్రమహాసభ తీర్మానాన్ని స్ఫూర్తిగా తీసుకుని జఫర్‌గడ్ ప్రాంతంలో రజాకార్ల ముఠాపై ప్రజలు, రైతులు తిరగబడి నిజాం, రజాకార్ల ప్రతినిధులను తరిమేశారు. దీంతో ఆగ్రహించిన ఖాదరెల్లి పోలీసులు, అనుచరులతో ప్రజలపై దాడులు చేయించాడు. కొద్దిరోజులకు మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామాన్ని చుట్టుముట్టి.. గ్రామానికి చెందిన 12 మందిపై గ్రామ కూడలిలో నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో చాడ అనంతరెడ్డి, బత్తిని బక్కరాజయ్య, దొంతూరి చినమల్లయ్య, ఎరుకలి ఇద్దయ్య, గుండెమల్ల పోశాలు, చెదలు నర్సయ్య, ఎండి.ఖాసీం, గుజ్జరి రామయ్య, దిడ్డి పెరుమయ్య, దుద్యాల చిన్న నర్సయ్య, గంద్రకుంట కోమటి నర్సింహరామయ్య, కుంట పెద్దాపురం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 8 మంది గాయాలతో ప్రాణాలు దక్కించుకున్నారు. ఈ ఘటనపై ప్రజలు ఆగ్రహావేశాలతో జఫర్‌గడ్‌లోని రజాకార్ల నేత ఖాదరెల్లి బంగ్లాపై దాడి చేసి, పశువుల కొట్టాన్ని, మొక్కజొన్న గూళ్లను దహనం చేశారు. పశువులను గ్రామస్థులకు పంపిణీ చేశారు.


జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి(జి)లో అమరుల స్మారక స్థూపం


ఆయుధం పట్టిన కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి (అచ్చమాంబ)

ఆయుధం పట్టిన అచ్చమాంబ

జఫర్‌గడ్ మండలం కూనూరుకు చెందిన నెల్లుట్ల సుశీలాదేవి అచ్చమాంబ పేరుతో భర్త నెల్లుట్ల మోహన్ రావుతో కలిసి సాయుధ పోరాటంలో ఆయుధం పట్టి నిజాం, రజాకార్లు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామానికి చెందిన అచ్చమాంబ 14ఏళ్ల వయసులోనే నిజాం, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంగా ఉద్యమంలో కూనూరుకు చెందిన దళ నేత నెల్లుట్ల మోహన్‌రావుతో ఏర్పడిన పరిచయంతో వివాహం చేసుకున్నారు. పోరాటంలో గాయపడిన కార్యకర్తలకు వైద్యం చేస్తూ.. మరోవైపు ఆమె మహిళలను చైతన్యవంతం చేస్తూ దళనాయకులతో కలిసి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం. ప్రస్తుతం భర్త చనిపోగా సుశీలాదేవి ప్రస్తుతం వరంగల్‌లో కుమార్తె వద్ద ఉంటున్నారు.

ఆగడాలకు ప్రత్యక్ష సాక్షి..

84ఏళ్లయినా చెక్కుచెదరని విస్నూరు గడి

పాలకుర్తి, సెప్టెంబరు 16 : నిజాం నవాబుకు ప్రధాన అనుచరుడైన విస్నూరు దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి తన కోసం ఓ గడీని నిర్మించుకున్నారు. ఆ గడి పేరు చెబితే చాలు ఈ ప్రాంత వాసులు గడ గడలాడే వారు. నాడు సుమారు 60 గ్రామాల ప్రజలతో వెట్టి చాకిరీ చేయించి ఈ గడిని నిర్మించారు. ఇది జరిగి 84 ఏళ్లయినా ఆ గడీ ఇంకా చెక్కు చెదరకుండా నూతన భవనంలా ఉంది. కానీ నిజాం, దేశ్‌ముఖ్, రజాకార్ల ఆగడాలు, దమన కాండకు, భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చేసిన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, షేక్ బందగీలు విస్నూరు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా ఎదురొడ్డి చేసిన పోరాటాలకు ఈ గడీ ప్రత్యక్షసాక్షిగా నిలిచింది.



నెహ్రూ ఇంటి తరహాలోనే నిర్మాణం

అలహాబాద్‌లోని అప్పటి ప్రధాని నెహ్రూ ఇంటి నిర్మాణం తర్వాత మరెక్కడా లేని విధంగా ఈ భవనం అధునాతన పరిజ్ఞానంతో నిర్మించారు. గడి నిర్మాణాన్ని 1940లో ప్రారంభించి 1943లో పూర్తి చేశారు. విస్నూరు చుట్టూ ఉన్న 60 గ్రామాల ప్రజల నుంచి రజాకార్లను పంపించి బలవంతంగా వసూళ్లు చేసిన రూ.2లక్షలను ఈ గడి కోసం ఖర్చు చేశారు. ఐదున్నరక ఎకరాల్లో బ్రిటీష్ సివిల్ ఇంజనీరు ప్లాన్‌తోనే నిర్మాణం జరగ్గా.. అప్పటి కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి వల్లూరి బసవరాజు పర్యవేక్షణలో ఈ నిర్మాణం పూర్తి చేశారు. 20 గజాలలోతు, 3గజాల వెడల్పుతో పునాదులు తవ్వి అప్పుడు ఊరిన నీటిని ఆయిల్ ఇంజన్‌లతో బయటికి తోడించి సున్నం, కంకరను పునాదుల్లో పోసి దిమ్మిసలతో అదిమి, పకడ్బందీగా నిర్మించారు. 2 గజాల వెడల్పు, 5 గజాల లోతులో ఐదున్నర ఎకరాల్లో ప్రహరీ నిర్మించారు. రంగూన్ నుంచి బర్మా టేకును, స్విడ్జర్లాండ్ నుంచి జర్మన్ టెక్నాలజీ విద్యుత్ స్విచ్ బోర్డులు తెప్పించారు. ఇక మరుగుదొడ్ల నీరు బయటకు వెళ్లేందుకు 2 కిలోమీటర్ల దూరం అండర్ గ్రౌండ్ కాలువను నిర్మించారు. తుపాకుల తూటాలు గోడలోకి దూసుకుపోకుండా సీసం, పాచి తీగ, కోడిగుడ్లను దంగు సున్నంలో కలిపి గడి గోడలు కట్టారు. 1943లో గృహప్రవేశ కార్యక్రమం జరగ్గా నిజాంనవాబు హాజరై దేశ్‌ముఖ్‌కు ధనరాశులను బహుమతిగా అందించారు. అలాగే విస్నూరులో దేశ్‌ముఖ్‌కు రక్షణగా 1937లో తొలి పోలీస్ ఠాణాను నిర్మించగా.. రెండోది రంగారెడ్డి జిల్లాలో నిర్మించారు. 84 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ముస్నూరు గడి చెక్కు చెదరకుండా నూతన భవనంలా ఉంది.


విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి (ఫైల్)


కామారెడ్డిగూడెంలోని షేక్‌బందగీ సమాధి

ఎందరో యోధుల స్ఫూర్తి

బందగీ పోరాటం చిరస్మరణీయం

దేవరుప్పుల, సెప్టెంబరు 16: నాటి నల్లగొండ జిల్లా జనగామ ప్రాంత విస్నూరు దేశ్‌ముఖ్ అయిన రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలు, అకృత్యాలకు ఎదురొడ్డి పోరాడిన దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య తొలి వీర మరణం పొంది చరిత్రకెక్కాడు. అంతేకాదు దేవరుప్పుల, ధర్మాపురం, కోలుకొండ, కడవెండి గ్రామాల్లోనే దాదాపు 40మంది విస్నూర్ దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా, నైజాం విముక్తిపోరులో పోరుసల్పి అసువులు బాశారు. గుండెనె ఉద్యమ జెండాగా చేసి పోరాడిన వారిలో దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెంకు చెందిన షేక్‌బందగీ ఒకరు. విస్నూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి ఆధీనంలో ఉన్న గ్రామాల్లో ఆయన చెప్పిందే వేదం. షేక్‌బందగీ అన్న అబ్బాస్‌అలీ విస్నూర్ దేశ్‌ముఖ్‌కు ముఖ్య అనుచరుడు. అన్నదమ్ముల మధ్య భూ వివాదం ఏర్పడగా.. అబ్బాస్‌అలీకి ఎక్కువ భూమి ఇవ్వాలని విస్నూరు దొర తీర్పుచెప్పారు. దానిని అంగీకరిచని బందగీ వాగ్వాదానికి దిగడంతో దొర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయినా తగ్గని బందగీ కోర్టుకు వెళ్లాడు. ఆ సమయంలో దొర ఎన్ని ప్రయత్నాలు చేసినా బందగీనే విజయం సాధించాడు. ఇలా పదేళ్లపాటు బందగీ చేసిన పోరాటం.. ఈ ప్రాంతంలో ఎంతో మందికి ధైర్యానిచ్చింది. కానీ బందగీపై కోపం పెంచుకున్న విస్నూరు దొర.. కోర్టు తీర్పు వచ్చిన ఆనందంతో ఉన్న బందగీ ఒక్కడే సూర్యాపేటకు వెళ్లే సమయంలో అతడి అన్న అబ్బాస్‌అలీని రెచ్చగొట్టి దాడి చేయించి తల నరికారు. అలా బందగీ ధైర్య సాహసాలను మరిచిపోలేని ప్రజలు కామారెడ్డిగూడెం స్టేజీ వద్ద బందగీ సమాధి కట్టారు. బందగీ స్ఫూర్తిని ఎంచుకొని 1944లో భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభకు యోధులు భారీగా తరలొచ్చారు. ఎక్కడ నలుగురు కలిసినా బందగీ ఉదంతమే చర్చకొచ్చేది.


కడవెండిలోని దొడ్డి కొమురయ్య స్మారక భవనం

విఘ్నేశ్వరుడికి ఘన వీడ్కోలు



ఏటూరునాగారం ముల్లెకట్ట వంతెన వద్ద వినాయకుడి నిమజ్జనం



కాళేశ్వరం గోదావరి వద్ద విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



ములుగులో నిమజ్జన శోభాయాత్రలో భక్తులు



ములుగు తోపుకుంట వద్ద బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ శబరీశ్



భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో నృత్యం చేస్తున్న సీఐ, ఎస్సై, సిబ్బంది



మహాముత్తారం నర్సింగాపూర్‌లో లడ్డు దక్కించుకున్న ఖయ్యూం

మహదేవపూర్, సెప్టెంబరు 16: విఘ్నేశ్వరుడి నిమజ్జనోత్సవాన్ని భక్తులు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన గణనాథులను మండలం కాళేశ్వరం అంతర్రాష్ట్ర వంతెన వద్ద నిమజ్జనం చేశారు. ఎస్పీ కిరణ్ ఖరే నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు చేయగా ఏఎస్పీ బోనాల కిషన్, కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి పర్యవేక్షించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌పాటు తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్లగొండ, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు కాళేశ్వరంలో నిమజ్జనం చేసేందుకు తరలివచ్చారు. భూపాలపల్లి నుంచి సింగరేణి రెస్క్యూ టీం, ఫైర్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు.

కలెక్టరేట్ నుంచి బయల్దేరిన గణనాథుడు

భూపాలపల్లి కలెక్టరేట్: కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన మట్టి గణేషుడు నిమజ్జనానికి తరలివెళ్లాడు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ప్రశాంత వాతావ రణంలో నిమజ్జన వేడుకలను జరుపుకోవాలని ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ సీసీలు, క్యాంపు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్: గణపతి దేవుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కాంక్షించారు. గణపతి నిమజ్జనోత్సవం సందర్భంగా సోమవారం భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్మ వాహిక గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జనానికి వెళ్తున్న భక్తులకు సన్మానం చేసే కార్యక్రమానికి తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్యతో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మత సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తున్న ఈ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవాహిని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పైడిపల్లి రమేష్, తాటి వెంకన్న, నాయకులు ఇస్లావత్ దేవన్, రాజిరెడ్డి, సమ్మయ్య, మహేష్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి, సంజీవరావ పాల్గొన్నారు.

స్టెప్పులు వేసి పోలీసులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి): భూపాలపల్లి ఠాణాలో ఏర్పాటు చేసిన గణేషుడికి పోలీస్ అధికారులు, సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సుధాకర్, రమేష్, ఉమెన్ ఎస్సై సంధ్యారాణి నృత్యాలు చేశారు.

కోలాటాలు.. నృత్యాలు

కాటారం: మండలవ్యాప్తంగా వినాయకుడి నిమజ్జనోత్సవాలు ఘనంగా జరిగాయి. గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువులు, ప్రాజెక్టులు, నదుల్లో నిమజ్జనం చేశారు. మహిళలు కోలాటాలతో సందడి చేశారు. యువకులు కేరింతలు, తుళ్లింతలతో భక్తిపాటలకు నృత్యాలు చేశారు. పలు పార్టీల నాయకులు, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు వినాయక మండ పాల వద్ద పూజలు నిర్వహించుకున్నారు. ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో పోలీ సులు బందోబస్తు నిర్వహించారు. లక్ష్మీదేవర ఆలయం వద్ద కొట్టె సతీష్, సుకన్య దంపతులు ఏర్పాటు చేసిన 51 కిలోల లడ్డూ ప్రసాదాన్ని జనగామ కిరణ్‌కుమార్ డ్రాలో గెలుపొందారు. బొప్పారంలో బీజేపీ నేత జిల్లెల్ల శ్రీశైలం లడ్డూ ప్రసాదాన్ని డ్రాలో దక్కించుకున్నారు.



కాళేశ్వరంలో పోలీసు బందోబస్తు

భారీ భద్రత నడుమ

మొగుళ్లపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో గణపతి నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఊరేగించి వాగులు, చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గణపసముద్రంలో నిమజ్జనం

గణపురం: మండల వ్యాప్తంగా ఉన్న గణనాథులను కొందరు భక్తులు కాళేశ్వరం నిమజ్జనానికి తీసుకెళ్లగా మరికొందరు మండల కేంద్రంలోని గణపసముద్రం వద్ద నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా సుమారు 20 మంది పోలీసులు, 10 మంది రెస్క్యూ టీం సిబ్బంది, 10మంది ఫిషరీస్ సిబ్బంది ప్రత్యేక విధులు నిర్వర్తించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సీఐ మల్లేష్, ఎస్సై అశోక్ పర్యవేక్షించారు.

విశేష పూజలు అందుకొని..

వెంకటాపూర్(రామప్ప): తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. డప్పుచప్పుళ్ల మధ్య భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.

ఘనంగా శోభాయాత్రలు

వెంకటాపురం(నూగూరు): మండలకేంద్రంలోని అప్పాలవారి వీధి, జక్కులవారి వీధి, ఏపీజీవీబీ బ్యాంకు సెంటర్‌లోని విగ్రహాలకు ఊరేగింపు (శోభాయాత్రలు) నిర్వహించిన అనంతరం పాత్రాపురం పంచాయతీ పరిధిలోని పాలెంవాగులో నిమజ్జనం చేశారు. జక్కులవారి వీధిలో లడ్డు వేలంపాట నిర్వహించగా రూ.42వేలకు కేతినేని శ్రీనివాసరావు దక్కించుకున్నారు. కలశంపాట రూ.16 వేలకు సీతాపతి దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు బాలసాని అశ్వపతి, ధనపనేని వెంకటేశ్వర్లు, జక్కుల శ్యామ్, చిట్టెం ఆదినారాయణ, ఈశ్వర్‌రావు, సునీల్, నాగరాజు పాల్గొన్నారు.

తొమ్మిది రోజుల పూజలు అందుకొని..

తాడ్వాయి: మండలంలోని కామారం, నర్సింగాపూర్, కాటాపూర్, లింగాల, కొడిశాల, బీరెల్లి, రంగాపూర్, తదితర గ్రామాల్లో తొమ్మిదిరోజులపాటు పూజలందుకున్న గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బావులు, చెరువుల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. అంతకు ముందు ఉత్సవ కమిటీ సభ్యులు డప్పువాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ, పాటలు పాడుతూ ఊరేగింపు నిర్వహించారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గంగమ్మ చెంతకు గణపయ్య

మంగపేట : మండల వ్యాప్తంగా వినాయుడి నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా మల్లూరు మధ్యతరహా ప్రాజెక్టులో ఈసారి నిమజ్జనం చేశారు. ఎస్సై నూరి బందోబస్తును పర్యవేక్షించారు. పలు గ్రామాల్లోని గణనాథులను ఏటూరునాగారం మండలంలోని ముల్లెకట్ట బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేశారు.

ముల్లెకట్ట గోదావరి వంతెన వద్ద..

ఏటూరునాగారం: మండలంలోని ఆయా ఆలయాలు, కాలనీలలో కొలువు తీర్చిన గణనాథులకు భక్తులు ఘనంగా వీడ్కో పలికారు. మేళతాళాలు, నృత్యాల నడుమ ఊరేగింపుగా మండలంలోని ముల్లెకట్ట గోదావరి వంతెన వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్.కె తాజుద్దీన్ బందోబస్తును పర్యవేక్షించారు.

లడ్డు దక్కించుకున్న ముస్లిం వ్యక్తి

మహాముత్తారం: మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో గణపతి నిమజ్జనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నర్సింగాపూర్‌లో మత సామరస్యం వెల్లివిరిసింది. ఎం.డి.ఖయ్యూం అనే ముస్లిం వ్యక్తి గణపతి మంటపం వద్ద వేలంపాడి రూ. 20వేలకు లడ్డు దక్కించుకున్నాడు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 16 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం బ్యారేజీలోకి 1.75లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద 3 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసా గుతోంది.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 16: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జనచైతన్య బస్సు యాత్ర సోమవారం ములుగుకు చేరుకోగా అంబేద్కర్ సెంటర్‌లో ఆయన చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు ఉద్యమకారులను పట్టించుకున్న పాపానపోలేదని, ఉద్యమకారుల అండతోనే కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. ఉద్యమకారుల కోసం సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని, 250గజాల ఇంటిస్థలంతోపాటు పెన్షన్, గుర్తింపుకార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చేవరకు ఉద్యమం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మురహరి భిక్షపతి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య, నాయకులు అబ్బ గోపాల్‌రెడ్డి, పత్తి గోపాల్‌రెడ్డి, రేండ్ల సంతోష్, దగ్గు ప్రభాకర్‌రావు, కూరెళ్ల రామాచారి, ఓదెలు, గడ్డమీది బాస్కర్, ఏడుకొండలు, మెట్టు మల్లయ్య, నర్రా భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

నేడు జూనియర్ కళాశాలను ప్రారంభించనున్న మంత్రి సీతక్క

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 16: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నూతనంగా ఏర్పాటైన జూనియర్ కళాశాలను మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ప్రారంభించనున్నారు. మండల కేంద్రంలో 1976లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండగా 1981లో అప్పటి అధికారులు అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయని ఖమ్మానికి తరలించారు. అప్పటి నుంచి నేటివరకు జూనియర్ కళాశాల లేకపోవడంతో ఈప్రాంత విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం జూనియర్ కళాశాల ఏర్పాటు కావడంతో విద్యార్థుల ఇబ్బందులు తొలగాయని మండల ప్రజలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

గనిలో జరిగే అక్రమాలను నివారించాలి

ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బుచ్చయ్య

కాకతీయఖని, సెప్టెంబరు 16: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-8వ గనిలో జరుగుతున్న అక్రమాలను యాజమాన్యం నివారించాలని ఐఎన్‌టీయూసీ భూపాలపల్లి బ్రాంచి ఉపాధ్యక్షుడు బుచ్చయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గనిలో పనిచేస్తున్న ఓ అధికారి ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తూ తనకు అనుకూలంగా ఉన్న వారికి యాక్టింగ్ మస్టర్లు ఇస్తూ కార్మికులను అయోమయానికి గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం గనిలో జరుగుతున్న గొడవలకు ఆయనే కారణమని, ఆయన్ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి : తుడుందెబ్బ

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 16: ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు చింత సోమరాజు అన్నారు. సోమవారం మండలంలోని మహితాపురం గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరగగా ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనేతరుల అక్రమ వలసలు పెరిగాయని, వాటిని అరికట్టాల న్నారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు క్రాంతికుమార్, జగన్, నర్సింహారావు పాల్గొన్నారు.

భిక్షపతి మృతదేహానికి నాగజ్యోతి నివాళి

తాడ్వాయి, సెప్టెంబరు 16: మండలంలోని దామెరవాయిలో ఇటీవల మతిస్థిమితంలేని వ్యక్తి చేతిలో గాయపడి మరణించిన మోరె ఎర్ర భిక్షపతి మృతదేహాన్ని సోమవారం మాజీ జడ్పీఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భిక్షపతి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు. ఆమె వెంట ఆత్మా ఛైర్మన్ దుర్గం రమణయ్య, బీఆర్ఎస్ నాయకులు నూశెట్టి రమేష్, బందెల తిరుపతి, మేడిశెట్టి నర్సింహయ్య, భాగి కోటేష్, రతన్, ఇటుకారి కృష్ణ, కార్తీక్, రజాక్, గయాజ్, పెదలాలయ్య, లక్ష్మీనర్సు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల బారిన పడొద్దు : డీఎంహెచ్‌వో

గోవిందరావుపేట, సెప్టెంబరు 16: సీజనల్ వ్యాధులబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య విద్యార్థులకు సూచించారు. సోమవారం మండలంలోని చల్వాయి, గోవిందరావుపేట బాలురు, బాలికల హాస్టళ్లలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మలేరియా, చికున్‌గున్యా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటి బారినపడకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈసదస్సులో డాక్టర్లు సునీత, అనూష, సిబ్బంది లక్ష్మి, జంపయ్య, శ్రీనివాస్, కృష్ణయ్య, కాలికా, రాజక్క, శకుంతల, వార్డెన్ శ్రీలత పాల్గొన్నారు.

కేటీపీపీ పైప్‌లైన్ లీకేజీ నీటి తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కాటారం, సెప్టెంబరు 16: మండల కేంద్రంలో చెల్పూరు కేటీపీపీకి కాళేశ్వరం గోదావరి నది నుంచి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీతో జాతీయ రహదారిపై భారీగా నిలుస్తున్న నీటిని సోమవారం తొలగింప జేశారు. మండల అధికారుల ఆదేశాలతో కాటారం జీపీ కార్యదర్శి సమీర్ ఖాన్ ఎక్స్‌కావేటర్ ద్వారా తవ్వింపజేసి నీటిని డ్రెయినేజీలోకి వెళ్లేలా చర్యలు చేపట్టారు. పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతున్న అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనంపై అధికారులు ఈ మేరకు స్పందించారు. పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేయడానికి కొంత సమయం పడుతుందని, ఒక మీటరుకు పైగా డయా ఉన్న ఇనుప పైప్‌కు లీకేజీ కావడంతో తవ్వడానికి ఇబ్బందిగా మారిందని కేటీపీపీ అధికారులు తెలిపారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందన్నారు.

ఘనంగా మిలాదున్నబీ వేడుకలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 16: మిలాదున్నబీ వేడుకలను మండలంలో ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని జామా మసీదు నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత గురువు అబ్దుర్రహ్మాన్, పలువురు ముస్లిం ప్రముఖులు, చిన్నారులు పాల్గొన్నారు.

• కాటారం: మండలంలోని పలు గ్రామాల్లో మిలాదున్నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. మండలకేంద్రంతో పాటు చింతకాని, ఇబ్రహీంపల్లి, అంకుసాపూర్, దేవరాంపల్లి, గంగారం, విలాసాగర్, దామెరకుంట తదితర గ్రామాల్లో మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు జాగారం చేసి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిద్దిఖ్ బేగ్, అమీర్, దాదా మియా, చోటేమియా, ఖలీల్, మస్తాన్, మసూద్, మంజూర్ హుస్సేన్, ఫెరోజ్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



ఏటూరునాగారంలో ముస్లింల ర్యాలీ

బ్లాస్టింగ్‌తో ఇల్లు నేలమట్టం

మల్హర్, సెప్టెంబరు 16 : మండల కేంద్రమైన తాడిచర్లలో బ్లాస్టింగ్‌తో ఇల్లు నేలమట్టమైంది. బాధితులు అనుమాల కొమురక్క తెలిపిన వివరాల ప్రకారం.. బొగ్గు తవ్వకాల కోసం చేపడుతున్న బ్లాస్టింగ్ వల్ల అప్పటికే గోడలు వారాయి. ఆదివారం మధ్యాహ్నం చేపట్టిన బ్లాస్టింగ్ వల్ల తమ ఇల్లు పూర్తిగా కుప్పలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూలేక పోవడం ప్రమాదం తప్పింది. అలాగే ఐదు రోజుల క్రితం గ్రామానికి చెందిన పైడాకుల మొండయ్య ఇంటి కాంపౌండ్ వాల్ కూడా బ్లాస్టింగ్ ధాటికి కుప్పకూలినట్లు బాధితుడు తెలిపాడు. తమకు నష్ట పరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు.

వాగు దాటి.. విద్యార్థులకు వైద్య సేవలు

ఏటూరునాగారం రూరల్, సెప్టెంబరు 16: ప్రమాదకరంగా మారిన వాగును దాటుతూ ఓ వైద్యుడు విద్యార్థులకు సోమవారం వైద్య సేవలు అందించాడు. మండలంలోని కొండాయి వైద్యాధికారి ప్రణీత్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దొడ్ల-మల్యాల గ్రామాల మధ్య ప్రవహిస్తున్న జంపన్నవాగు దాటి వెళ్లారు. మల్యాలలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. జ్వరంతో ఇబ్బంది పడుతున్న 18 మంది విద్యార్థులకు మందులు అందించారు కొండాయిలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ బాస్కర్, ఏఎన్ఎంలు సమ్మక్క, ఆశా వర్కర్లు లక్ష్మి, భాగ్య ఉన్నారు.



వాగుదాటుతున్న వైద్యాధికారి

నైట్ క్యాంపింగ్ సైట్‌ను సందర్శించిన అధికారులు

గోవిందరావుపేట, సెప్టెంబరు 16: లక్నవరం నైట్ క్యాపింగ్ సైట్‌ను పీసీసీఎఫ్ సువర్ణ, కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్, ములుగు డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్ సోమవారం సందర్శించారు. సైట్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. వారి వెంట ఏటూరునాగారం ఎఫ్‌డీవో రమేష్, పస్రా రేంజ్ అధికారి మాధవి శీతల్, చల్వాయి ఎఫ్ఎస్‌వో వేణుగోపాల్‌రెడ్డి, లక్నవరం ఎఫ్‌బీవో దీప్‌లాలు ఉన్నారు.

ప్రతిభ ఉంటే పది లక్షలు

- డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలు
- ఆర్బీఐ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహణ
- రిజిస్ట్రేషన్‌కు నేడే చివరి గడువు

వెంకటాపూర్ (రామప్ప), సెప్టెంబరు 16: విద్యార్థులకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఓ అద్భుత ఆఫర్ ఇస్తోంది. దేశ వ్యాప్తంగా డిగ్రీ, పీజీ విద్యార్థులకు 'ఆర్‌బీఐ-90 క్విజ్' పేరిట జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి రూ. 10 లక్షలు గెలుచుకొనే అవకాశం కల్పిస్తోంది. ఆర్‌బీఐ 90వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఈ పోటీలకు శ్రీకారం చుట్టింది. దీనికి ఇప్పటికే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈనెల 17 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు గడువు ఉంది. ఈనెల 19 నుంచి 21 వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పోటీలు జరుగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, పీజీ కళశాలల విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొన వచ్చని ములుగు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ గేరా జయప్రకాశ్ తెలిపారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

క్విజ్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2024 సెప్టెంబరు 1 నాటికి 25 ఏళ్ల వయసు కలిగి ఉడాలి. ఏదైనా కళశాలలో డిగ్రీ చదువుతున్నవారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు.. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్‌బీఐ90 క్విజ్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా ఈ నెల17లోగా దరఖాస్తు చేసుకోవాలి. గుర్తింపు కార్డు, ఈ-మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయాలి. ఇందుకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవ సరం లేదు. ఒక్కో కళాశాల నుంచి ఎంత మందైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో బృందానికి ఇద్దరు విద్యార్థులు ఉండాలి.



నాలుగు దశల్లో పోటీలు

నాలుగు దశల్లో ఆర్బీఐ క్విజ్ పోటీలు జరుగనున్నాయి. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జోనల్ స్థాయి, జాతీయస్థాయి పోటీలు ఉంటాయి. మొదటి రౌండ్ ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఇందులో 36 మల్టీపుల్ ప్రశ్నలు ఉంటాయి. 15 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇద్దరు విద్యార్థుల జతతో ఇక పరికరం (ఫోను, ట్యాబ్లెట్, ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్) ద్వారా పోటీల్లో పాల్గొనాలి.

నగదు బహుమతులు ఇలా..

రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి రూ. 2లక్షలు, ద్వితీయ రూ. 1.50లక్షలు, తృతీయ రూ. లక్ష, జోనల్‌స్థాయిలో ప్రథమ రూ. 5లక్షలు, ద్వితీయ రూ.4లక్షలు, తృతీయ రూ. 3లక్షలు, జాతీయ స్థాయిలో ప్రథమ రూ. 10లక్షలు, ద్వితీయ రూ. 8లక్షలు, తృతీయ రూ. 6లక్షలు ఇవ్వనున్నారు.